సాక్షి
విజయనగరం

బుధవారం । 24 । మే । 2023



స్త్రీనిధితో జీవనోపాధి !

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలా అండగా ఉంటోంది. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అనేక పథకాలను అమలు చేస్తోంది. - 8లో



తమ్ముడే కాలయముడు

తోడబుట్టిన తమ్ముడే అన్నయ్యను కత్తితో హతమార్చాడు. కుటుంబంలో విషాదం నింపాడు. - 8లో

వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కెట్లు

విజయనగరం పూల్‌బాగ్: పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2వ తేదీ నుంచి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నట్టు డీఈఓ బి లింగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టిక్కెట్లు, పాఠశాల నామినల్‌రోల్స్‌ను www.bre.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. డౌన్‌లోడ్ చేసిన హాల్‌టిక్కెట్లపై సంబంధిత ప్రధానోపాధ్యాయులు సంతకం చేసి విద్యార్థులకు అందజేయాలన్నారు.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి హకీ పోటీలకు చందు



జాతీయ హకీ పోటీలకు ఎంపికైన చందు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాలుర హకీ పోటీలకు విజయనగరానికి చెందిన గండి చందు ఎంపికయ్యాడు. గతేడాది డిసెంబర్‌లో విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ జట్టుకు అర్హత సాధించిన చందు తాజాగా ఈ నెల 19 నుంచి 30 వరకు ఒడిశా రాష్ట్రంలోని రూర్కెలలో జరగబోయే పోటీల్లో పాల్గొనగా.. రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న చందు బెస్ట్ ప్లేయర్ అవార్డు అందుకున్నాడు.

ఆపన్నహస్తం



కేన్సర్‌తో బాధపడుతున్న సరస్వతికి రూ. 50 వేల చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

మెరకముడిదాం: ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం చేయడం సంతృప్తినిస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గత కొన్నేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సోమలింగాపురం గ్రామానికి చెందిన సరస్వతికి రూ.50 వేలు, వింత వ్యాధి బారిన పడిన గాదెల మర్రివలసకు చెందిన ఎస్.గణపతి అనే బాలుడుకి రూ.50 వేలు, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న గొల్లలవలస గ్రామానికి చెందిన కల్లేపల్లి పాపారావుకు రూ. 50 వేలు చొప్పున మెరకముడిదాం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం అందజేశారు. వైద్య ఖర్చులకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, డీపీఓ శ్రీధర్‌రాజా, ఎంపీడీఓ పి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్‌శాఖలో బదిలీలు

- 8 మంది ఏఎస్‌ఐలు, 16 మంది హెచ్‌సీలు, 78 మంది పీసీలకు బదిలీ



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్ల బదిలీ కౌన్సెలింగ్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఎం.దీపిక మంగళవారం నిర్వహించారు. ఒకే స్టేషన్‌లో ఐదేళ్లు విధులు పూర్తిచేసుకున్న ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లను వారి వయసు ప్రాధాన్యత ఆధారంగా జాబితా తయారు చేసి కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో ఏర్పడిన ఖాళీలను స్క్రీన్ మీద చూపుతూ వారు కోరుకున్న స్టేషన్‌కు ఎలాంటి సిఫార్సులు లేకుండా బదిలీ చేశారు. 8 మంది ఏఎస్‌ఐలు, 16 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 76 మంది పోలీస్ కానిస్టేబుళ్లను వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఏఎస్పీ అస్మా ఫర్హీన్, పోలీస్ కార్యాలయ ఏఓ వెంకటరమణ, ఎస్‌బి సీఐ నరసింహమూర్తి, జూనియర్ సహాయకులు చాముండేశ్వరీ పాల్గొన్నారు.


అండర్-14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



సాగుతున్న క్రికెట్ ఎంపిక పోటీలు

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజ్జీస్టేడియంలో అండర్-14 బాలుర ప్రాబబుల్స్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు మంగళవారం జరిగాయి. పోటీలకు జిల్లా వ్యాప్తంగా 42 మంది క్రీడాకారులు హాజరుకాగా 26 మందితో కూడిన ప్రాబబుల్స్ జట్టును ఎంపిక చేశారు. వీరి మధ్య పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మంది సభ్యులతో కూడిన జిల్లా జట్టును ఎంపిక చేస్తామని వీడీసీఏ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు తెలిపారు. ఎంపిక పోటీలను సెలెక్టర్లు బంగార్రాజు, వర్మ, సర్వరాజులు పర్యవేక్షించారు. ఎంపిక పోటీల్లో కోచ్‌లు చంద్రశేఖర్, చందక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత దిశగా..



విజయనగరం కార్పొరేషన్ ముఖ చిత్రం

- స్వచ్ఛసర్వేక్షణ్ సర్వేకు సిద్ధమవుతున్న కార్పొరేషన్
- ఈ నెల చివరి వారంలో పర్యటించనున్న కేంద్ర బృందం
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో 9,500 మార్కులకు జరగనున్న సర్వే
- గతేడాది రాష్ట్ర స్థాయిలో 18, జాతీయ స్థాయిలో 256 ర్యాంకు సాధన

విజయనగరం:

మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, నగర పంచాయతీల్లో పరిశుభ్రత చర్యలపై ఏటా నిర్వహించే స్వచ్ఛసర్వేక్షణ్ సర్వేకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో తీసుకుంటున్న చర్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ర్యాంకులను ప్రకటిస్తుంది. ఇందులో భాగంగా ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి ఈ నెలాఖరున సర్వే బృందం విజయనగరం కార్పొరేషన్ పరిధిలో పర్యటించనున్నట్టు ముందుస్తుగా సమాచారం అందింది. ఇప్పటివరకు చేసిన కార్యక్రమాలతో పాటు కేంద్ర బృందాలు తనిఖీ చేసే సమయంలో ఎలా వ్యవహరించాలి అనే దానిపై కార్పొరేషన్ అధికారులు సమాయత్తమవుతున్నారు. పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యమిస్తున్నారు.

తడిపొడి చెత్త సేకరణ

ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ, చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీని సర్వే బృందం పరిశీలిస్తుంది. ఈ రెండు ప్రక్రియల అమల్లో కార్పొరేషన్ యంత్రాంగం 60 శాతం సఫలీకృతంకాగా, 100 శాతం అమలు దిశగా అధికారులు కృషిచేస్తున్నారు.

- ప్లాస్టిక్ నియంత్రణపై ఒక అడుగు ముందుకు... రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. హోల్‌సేల్ విక్రయాల నియంత్రణలో అధికారులు వైఫల్యం కట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీనిని సరిచేయాల్సి ఉంది. సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ మెరుగుపడాల్సి ఉంది.

కేంద్ర బృందం పరిశీలించే అంశాలు ఇవే...

కేంద్రం నియమించిన బృందాల సభ్యులు ఈ నెలాఖరున ఏదో ఒక సమయంలో విజయనగరం కార్పొరేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేస్తారు. స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వకుండానే కొన్ని ప్రాంతాలను పరిశీలిస్తారు. ఆ మేరకు మార్కులు కేటాయిస్తారు.

- తడి, పొడి చెత్త సేకరణ పరిశీలిస్తాయి. ఇందుకు గరిష్ఠంగా 600 మార్కులు కేటాయించారు. బహిరంగ ప్రదేశాల్లో శుభ్రత, పారిశుద్ధ్య పనుల నిర్వహణకు 300 మార్కులు ఇస్తారు.
- ప్లాస్టిక్ నిషేధం, రీసైక్లింగ్ విధానాలకు 200 మార్కులు, పారిశుద్ధ్య కార్మికులకు సమకూర్చిన ప్రయోజనాలకు 135, మురుగు కాలువల పరిశుభ్రతకు 75, వేస్ట్‌టు ఎనర్జీ పార్కుకు 100, తడి చెత్తతో ఎరువు తయారీకి 100, పొడి చెత్త నిర్వహణకు 150 ఇలా మొత్తం 9,500 మార్కుల ప్రాతిపదికన ర్యాంకులను ప్రకటిస్తారు.

నిరంతరం పర్యవేక్షణ

నగరంలో పారిశుద్ధ్యం నిర్వహణలో మార్పులు తీసుకొచ్చారు. ప్రతి డివిజన్‌లో ఒక పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శి, పీహెచ్ మేస్త్రీ, ఒక వాహనం, డంపర్ ప్లేసర్, టిప్పర్లను కేటాయించారు. వాణిజ్య ప్రాంతాల్లో ప్రతి దుకాణానికి రెండు చెత్త బుట్టు ఇచ్చారు. తోపుడు బండ్లు పెట్టారు. ఇంటింటా వలంటీర్లు, వార్డు కార్యదర్శుల ద్వారా పరిశుభ్రతపై ప్రచారం చేస్తున్నారు. ప్రధాన కూడళ్లు, వాణిజ్య సముదాయాలు, వర్తక దుకాణాలు, ప్రధాన వీధులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన గాలి అందించడానికి పచ్చదనం పెంపుదలకు చర్యలు చేపట్టారు.

స్వచ్ఛతలో గత ర్యాంకులు ఇలా...

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో విజయనగరం కార్పొరేషన్ పరిస్థితి గతంలో మెరుగ్గా ఉన్నప్పటికీ కాలక్రమంలో ర్యాంకుల సాధనలో అటుఇటుగా ఉంది. ప్రజారోగ్య విభాగం అధికారుల, సిబ్బంది వైఫల్యమే కారణంగా కనిపిస్తోంది. 2018లో రాష్ట్ర స్థాయిలో 11వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 154 ర్యాంకు సాధించిన విజయనగరం, 2019లో వరుసగా 9, 126 ర్యాంకులతో మెరుగుపడింది. అనంతరం 2020లో రాష్ట్ర స్థాయిలో 15వ ర్యాంక్‌కు, జాతీయ స్థాయిలో 256 ర్యాంక్‌కు పడిపోయింది. 2021లో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 113 ర్యాంక్‌తో మెరుగుపడినప్పటికీ, 2022లో రాష్ట్ర స్థాయిలో 18 ర్యాంకు, జాతీయ స్థాయిలో 256 ర్యాంకు సాధించింది.

పరిశుభ్రతే ప్రధానం

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే ప్రధానంగా పరిశుభ్రతపైనే జరగనుంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిత్యం 120 టన్నుల చెత్త, ఇతర వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది సేకరించి గుణుపూరుపేట డంపింగ్‌యార్డ్‌తో పాటు విశాఖకు తరలిస్తున్నారు. ఈ ప్రక్రియలో అవుట్‌సోర్సింగ్, శాశ్వత పద్ధతిపై 633 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. సేకరించిన చెత్తను తరలించేందుకు 40 పెద్ద వాహనాలను, క్లాప్ కార్యక్రమంలో మరో 54 ఆటోలను వినియోగిస్తున్నట్టు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. నగరంలో ప్రతి 300 నుంచి 350 కుటుంబాలను కలిపి ఒక మైక్రో ప్యాకెట్‌గా గుర్తించి అవసరం మేరకు ఇద్దరు నుంచి ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. ఇలా తమకు కేటాయించిన ప్యాకెట్‌లో మాత్రమే పారిశుద్ధ్య కార్మికులు ఉదయం చెత్త సేకరణ, మధ్యాహ్నం రోడ్లు, కాలువల శుభ్రం తదితర పనులు చేపడుతున్నారు. డివిజన్ల వారీగా కాకుండా కేటాయించిన ప్యాకెట్లలో కార్మికుల్ని నియమించడం ద్వారా విధుల్లో బాధ్యత, జవాబుదారీతనం పెరిగింది. గుణుపూరుపేట డంపింగ్ యార్డ్‌లో బయోమైనింగ్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విధానం అమల్లోకి తీసుకొచ్చింది



ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేకు సన్నద్ధం

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేకు సన్నద్ధమవుతున్నాం. ఈ ఏడాది మెరుగైన ర్యాంకు సాధించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలు అంశాల్లో మెరుగైన మార్కులు సాధించే దిశగా కృషి చేస్తున్నాం. గణుపూరుపేట డంపింగ్‌యార్డ్‌లో బయోమైనింగ్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విధానం అమల్లోకి తీసుకువచ్చాం. రోజు ఉత్పత్తి అవుతున్న చెత్తలో 60 నుంచి 80 టన్నులు తడి, పొడి చెత్తను జిందాల్ విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమకు తరలిస్తున్నాం. త్వరలో నగరంలో రాత్రి వేళల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రెడ్డి శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

- సర్వజన, ఘోష ఆస్పత్రులను తనిఖీ చేసిన కలెక్టర్ నాగలక్ష్మి
- చికిత్స, మందులు, వైద్య సేవలపై ఆరా..



ఘోష ఆస్పత్రిలో వైద్య సేవలపై రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ నాగలక్ష్మి వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. ఘోష ఆస్పత్రి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఏమ్మా బాగున్నావా.. వైద్యులు బాగా చూస్తున్నారా.. ప్రేమగా మాట్లాడుతున్నారా.. రోజూ వస్తున్నారా.. మందులన్నీ ఇస్తున్నారా.. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉన్నాయా అంటూ కలెక్టర్ నాగలక్ష్మి ఘోషాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని పిల్లలవార్డులు, ఆపరేషన్ థియేటర్, స్కానింగ్ సెంటర్, ల్యాబ్, ఈసీజీ, ఐసీయూ, ప్రీ ఆపరేషన్ వార్డు, పోస్టు ఆపరేషన్ వార్డు, ఎస్‌ఎన్‌సీయూ తదితర అన్ని విభాగాలను పరిశీలించారు. వైద్యులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి విజ్ఞప్తిమేరకు ఏసీలు, డెస్క్ టాప్‌లు, ప్రింటర్లు, స్కానర్లు సి-టాప్, వెంటిలేటర్లు తదితర పరికరాలు అందజేస్తామన్నారు. జనరేటర్‌కు ఆటో స్విచ్ సౌకర్యాన్ని కల్పించాలని సూచించారు. ఆ తర్వాత ఆధునీకరించిన ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ, ఓపీ, వార్డులను, స్కానింగ్ ఎక్సరే, బ్లడ్ బ్యాంక్, ల్యాబొరేటరీలను పరిశీలించారు. సీహెచ్‌సీలు నుంచి సిటీస్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్ల కోసం రిఫర్ చేసేవారికి స్కాన్ తీస్తున్నారా లేదా అని టెక్నీషియన్ సతీష్‌ను అడగగా తీస్తున్నామని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతో సమావేశమయ్యారు. వైద్యుల విజ్ఞప్తి మేరకు కల్చర్ ల్యాబ్ మెటీరియల్, ఇతర విభాగాల నిపుణులు, ఐటీడీపీ కిట్స్, జనరేటర్, బయోమెట్రిక్ పరికరాలు, నెట్ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. వైద్యాధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిలోని సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల డాక్టర్ కె. పద్మలీల, సూపరింటెండెంట్ ఎస్.అప్పలనాయుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ బొత్ససంతోష్, ఆర్ఎంఓలు లక్ష్మణరావు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

గురుదేవా ట్రస్టుకు అంబులెన్స్ వితరణ



గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్‌కు అంబులెన్స్ తాళాలు అందజేస్తున్న శారద కర్మాగార ప్రతినిధులు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి కంటకాపల్లి సమీపంలోని శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ కర్మాగారం ప్రతినిధులు అంబులెన్స్‌ను మంగళవారం వితరణగా అందజేశారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబుకు కర్మాగారం ప్రతినిధులు హెచ్. సన్యాసిరావు, జి.శంకరరావు, కె.సంతోష్‌కుమార్ అంబులెన్స్ తాళాలు అందజేశారు. శారద కర్మాగారం యాజమాన్యానికి ట్రస్టు చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్‌స్పెషాల్టీ ఆస్పత్రిలో అన్ని రకాల సేవలు, వైద్యపరీక్షలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. విశాఖపట్నానికి చెందిన ఎస్ఆర్‌ఐ ఆస్పత్రితో కలిసి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

ఆ పాపం మాకొద్దు



ఎస్.కోటలో చంద్రబాబు సభ జరిగిన స్థలాన్ని, పసుపు నీటితో శుద్ధి చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇళ్ల లబ్ధిదారులు

- చంద్రబాబు రోడ్డుషో, సభాస్థలి ప్రాంతాన్ని పసుపునీటితో శుద్ధిచేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

శృంగవరపుకోట: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు మానసిక స్థితి సరిగాలేదని, ఎస్.కోట వేదికగా పేదల ఇళ్లను సమాధులతో పోల్చడాన్ని ఎమ్మెల్సీ రఘురాజు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు తప్పుబట్టారు. ఆ పాపం పోవాలని ఆకాంక్షిస్తూ... చంద్రబాబు సభాస్థలిని పసుపునీటితో మంగళవారం శుద్ధి చేశారు. ముందుగా ఎస్.కోట పట్టణంలోని శ్రీనివాస థియేటర్ నుంచి దేవీ కూడలి వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, లబ్ధిదారులతో కలిసి నిరసన ర్యాలీ చేశారు. పేదలకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన వాఖ్యలను ఉపసంహరించుకోవాలని నినదించారు. దేవీ కూడలిలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రఘురాజు, నాయుడుబాబు మాట్లాడుతూ పేదలు ఎంతో అపూరూపంగా పేదలు సొంత ఇళ్లను కట్టుకుంటుంటే వాటిని సమాధులు, శ్మశానాలుగా పేర్కొనడం చంద్రబాబు దురహంకారానికి నిదర్శనమన్నారు. తెలుగుదేశం పార్టీని సమాధుల్లో పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్న విషయం గుర్తించుకోవాలన్నారు. నోరు ఉందని జగన్‌మోహన్‌రెడ్డిని తిడుతుంటే అన్నను ప్రేమించే అక్కచెల్లెళ్లు చూస్తూ ఊరుకోరని చెప్పారు. అదే సమయంలో జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ సుధారాజు తదితరులు చంద్రబాబు వాఖ్యలను తిప్పికొట్టారు. చంద్రబాబు తీరు మారకుంటే ఈదఫా చీపుర్లుతో తరిమికొడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీలు పినిశెట్టి వెంకటరమణ, సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, వైస్ సర్పంచ్ మోపాడ కుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

స్కిల్‌హబ్‌లతో ఉపాధి



ధ్రువపత్రాలు పొందిన అభ్యర్థులతో అధికారులు

- జిల్లా యువజన సర్వీసులశాఖ ముఖ్య కార్యదర్శి డి.రామ్‌గోపాల్

విజయనగరం రూరల్: యువత వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్‌హబ్ కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తోందని జిల్లా యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి డి.రామ్‌గోపాల్ తెలిపారు. జిల్లాలోని విజయనగరం, చీపురుపల్లి నియోజకవర్గ కేంద్రాల్లోని స్కిల్‌హబ్‌లలో సీఆర్ఎం డొమెస్టిక్ నాన్‌వాయిస్, ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్సులలో శిక్షణ పూర్తిచేసుకున్న యువతకు విజయనగరం ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం ధ్రువపత్రాలను అందజేశారు. శిక్షణ పొందిన వారికి వెంటనే పలు సంస్థల్లో ఉపాధి అవకాశాలు లభించడం శుభపరిణామంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారిణి డి.అరుణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నీలం గోవిందరావు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

సివిల్స్‌లో మెరిసిన పెదవేమలి కుర్రాడు

- సివిల్స్ ఫలితాల్లో 772 ర్యాంకు సాధన
- తండ్రి ఆర్టీసీలో సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్, తల్లి గృహిణి



భార్గవ్

గంట్యాడ: సివిల్స్ ఫలితాల్లో గంట్యాడ మండలం పెదవేమలికి చెందిన యువకుడు పాటుపురెడ్డి భార్గవ్ ప్రతిభ చూపాడు. 772 ర్యాంకు సాధించాడు. ఐఆర్ఎస్‌గాని ఐఎఫ్ఎస్ గాని వచ్చే అవకాశం ఉంది. తండ్రి సత్తిబాబు విజయనగరం ఆర్టీసీలో సెక్యూరిటీ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. తల్లి పద్మావతి గృహిణి. భార్గవ్ చిన్నప్పటి నుంచి చదవులో ముందుండేవాడు. కష్టపడి చదివేవాడు. 1 నుంచి 10వ తరగతి వరకు విజయనగరంలోని భాష్యం స్కూల్‌లోను, ఇంటర్మీడిట్ విశాఖపట్నంలోని చైతన్య కళాశాలలో చదివాడు. బీటెక్ విద్యను ముంబయి ఐఐటీలో పూర్తి చేశాడు. అనంతరం కేంద్రప్రభుత్వ ఉద్యోగంలో చేరి ఆరో నెలలపాటు పనిచేశాడు. అనంతరం సివిల్స్‌పై ఉన్న ఆసక్తితో ఉద్యోగానికి రాజీనామా చేసి పరీక్షకు సన్నద్ధమయ్యాడు. ఇప్పటివరకు నాలుగు సార్లు రాశాడు. ఐదో ప్రయత్నంలో 772 ర్యాంకు సాధించాడు.

ఐఏఎస్ కావాలన్నదే లక్ష్యం

ఐఏఎస్ సాధించాలన్నదే నా లక్ష్యం. దీనికోసం కష్టపడి చదివాను. ప్రస్తుతం 772వ ర్యాంకు వచ్చింది. ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్)గాని, ఇండియన్ ఫారెస్టు సర్వీస్ (ఐఎఫ్ఎస్)గాని వచ్చే అవకాశం ఉంది.

– పాటుపు రెడ్డి భార్గవ్, పెదవేమలి, గంట్యాడ మండలం

ఉపాధ్యాయుల బదిలీలకు సన్నద్ధం

విజయనగరం పూల్‌బాగ్: ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం ఆదేశాల జారీ చేసినట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలకు సంబంధించి ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25 నుంచి 27 వరకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉంటుందన్నారు. 28 నుంచి సీనియారిటీ లిస్టును వెల్లడిస్తామన్నారు. 30 నుంచి అభ్యంతరాల స్వీకరణ అనంతరం జూన్ 2 నుంచి ఫైనల్ సీనియారిటీ లిస్టు వెబ్‌సైట్‌లో పెడతామని పేర్కొన్నారు. జూన్ 4న ఖాళీల లిస్టును వెల్లడిస్తామని, జీరో సర్వీస్ కలిగిన ఉపాధ్యాయులు కూడా రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ కింద దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు సీఎస్ఈ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.





తొలగిన దారిద్ర్యం

చిత్రంలో కనిపిస్తున్నది రామభద్రపురం మండలంలోని గొల్లపేట నుంచి జోగిందొరవలన మీదుగా కారెందొరవలన గ్రామాలకు వెళ్లే రోడ్డు. గత టీడీపీ హయాంలో మట్టి రోడ్డుగా ఉండేది. తారురోడ్డు వేయాలని స్థానికులు ఎన్నిసార్లు విన్నవించినా అప్పటి నేతలు పట్టించుకోలేదు. వర్షం కురిస్తే బురద రోడ్డుపై రాకపోకలకు నరకం చూసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రాంతీయుల దారి కష్టాలను గుర్తించింది. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగివెంకట చిన అప్పలనాయుడు చొరవతో రూ.2 కోట్లను కేటాయించింది. 3.1 కిలోమీటర్ల రోడ్డును తారురోడ్డుగా నిర్మించింది. ప్రయాణం సాఫీగా సాగిపోతుండడంతో సంతోషపడుతున్నారు. – రామభద్రపురం

లోక్‌అదాలత్‌తో సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగమణి

విజయనగరం రూరల్: లోక్‌అదాలత్‌తో కేసులకు సత్వర పరిష్కారం దొరుకుతుందని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణి పేర్కొన్నారు. మండలంలోని చెల్లూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. న్యాయపరమైన సమస్యలు త్వరితగతిన పరిష్కారానికి జిల్లా న్యాయ సేవా సంస్థ కృషి చేస్తుందన్నారు. రాజీయే రాజమార్గమని, అనవసర వివాదాల్లో తలదూర్చి కాలాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు ఇన్‌చార్జిలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జోనల్ (విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి) ఇన్‌చార్జిలను నియమించారు. యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జిగా ముత్తంశెట్టి వెంకట శివసాయి నందీష్, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జిగా పీలా వెంకటలక్ష్మిని నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

బంగారం నగలు, నగదు అపహరణ

బొండపల్లి: మండల కేంద్రం బొండపల్లిలో జాతీయ రహదారి26ను ఆనుకుని ఉన్న ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారు నగలతో పాటు నగదును అపహరించుకు పోయారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహంతి కృష్ణ ఇంట్లో 4 తులాలు బంగారు ఆభరణాలతో పాటు, 5 తులాల వెండి వస్తువులు, కొంత నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయడంతో క్షేత్ర స్థాయిలో విచారణ జరిపామని ఎస్సై ఎస్.రవి తెలిపారు. బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావుతో పాటు పోలీసు సిబ్బంది దర్యాప్తు నిర్వహించడంతో పాటు దొంగతనం జరిగిన ప్రాంతాన్ని, పరిసరాలను పరిశీలించి వివరాలు సేకరించామని ఎస్సై వివరించారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


రామకృష్ణ మృతదేహం

గంట్యాడ: మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన కిలపర్తి రామకృష్ణ(34) విద్యుత్ షాక్‌తో మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. రామకృష్ణ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గ్రామంలో పరదేశమ్మ పండగ 22,23,24 తేదీల్లో చేస్తుండడంతో బంధువులందరినీ పండగకు పిలిచాడు. రెండు రోజుల క్రితం ఇంట్లో ఉన్న మోటారు పాడవడంతో బాగు చేయించి తెచ్చాడు. మంగళవారం ఉదయం మోటార్ ఆన్ చేయగా నీరు తక్కువగా రావడంతో బాగు చేయడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి కింద డిపోయాడు. వెంటనే సోదరుడు మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి పడిపోయిన రామకృష్ణను 108 అంబులెన్సులో విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రికి చేరిన కొద్ది సేపటికే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పండగ వేళ కుటుంబ పెద్ద చనిపోవడంతో భార్యాపిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

సారా స్థావరాలపై దాడి

పాచిపెంట: మండలంలోని గొట్టూరు పంచాయతీ దిగువ గొట్టూరు సమీపంలో సారా బట్టీలపై మంగళవారం దాడులు చేసినట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. ఈ దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. నిందితుడు శెబీ వెంకటరావుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నిందితుడికి రిమాండ్

పాలకొండ రూరల్: నగరపంచాయతీ పరిధి 3వ వార్డు ఎన్‌కె.రాజపురంలో ఇటీవల జరిగిన ఘర్షణలో ముడిదాన మోహన్‌రావు ఆదే ప్రాంతానికి చెందిన చందక శివశంకర్‌పై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ క్రమంలో మంగళవారం నిందితుడికి న్యాయస్థానం 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై బి.శివప్రసాద్ తెలిపారు.

ప్రేమించిన యువతితోనే పెళ్లి

శ్రీకాకుళం క్రైమ్: సంతకవిటికి చెందిన ఓ యువకుడు ముంబయిలో ఏడాదిన్నరగా ఓ కంపెనీలో చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. అదే కంపెనీలో ముంబయికి చెందిన యువతిని ప్రేమించాడు. ఈలోగా యువకుడి తల్లిదండ్రులు శ్రీకాకుళానికి చెందిన మరో యువతితో నగరంలో నిశ్చితార్థం జరుపుతుండగా అప్పటికే అక్కడికి చేరుకున్న ముంబయి యువతి అడ్డుకుంది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఇరువైపులా పెద్దల సమక్షంలో యువకుడు ప్రేమించిన యువతితోనే వివాహానికి శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ప్రవల్లిక చెప్పారు. మరో రెండు రోజుల్లో ఇద్దరూ రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటారని తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 485.00
శ్రీకాకుళం	రూ. 485.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,000-00
బంగారం(22సి. 10గ్రా.)	61,100-00
వెండి (కిలో)	78,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹142	₹254	₹ 264

స్త్రీనిధితో జీవనోపాధి !

- ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న మహిళలు
- ఒక్కో గ్రూప్‌కు రూ.7లక్షల రుణం


స్త్రీ నిధి రుణాల కోసం సమావేశమైన మహిళలు

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



మహిళల జీవనోపాధి అభివృద్ధి కోసం ప్రభుత్వం స్త్రీ నిధి రుణాలు ఇస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 19,699 వేల మంది సభ్యులకు రూ.72 కోట్ల స్త్రీ నిధి రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటికే రూ.3.2 కోట్లకుపైగా రుణాలు అందజేశాం. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆసక్తి ఉన్న రంగాల్లో ఈ నిధులను పెట్టుబడిగా పెట్టి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి.

– పి.కిరణ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలా అండగా ఉంటోంది. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అనేక పథకాలను అమలు చేస్తోంది. అందులో భాగంగా పొదుపు సంఘంలో సభ్యులైన మహిళలకు స్త్రీ నిధి ద్వారా జీవనోపాధి కోసం రుణాలను అందజేస్తోంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రుణం చాలా తక్కువగా ఉండేది. ఒక్కో గ్రూప్‌కు లక్ష రూపాయలు మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం ఒక్కో గ్రూపులో ఏడుగురు సభ్యులకు లక్ష చొప్పున రూ.7 లక్షలు ఇస్తున్నారు. దీనిపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్త్రీనిధి రుణాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలను స్త్రీ నిధి రుణాలు అత్యవసర సమయాల్లో ఆదుకుంటున్నాయి. కొందరు పిల్లల చదువులు, వివాహాలకు, మరికొందరు జీవనోపాధికి వినియోగించుకుంటున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 19,699 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వాటిలో సుమారు 2,28,749 మందికి పైగా మహిళలు రుణాలు తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్త్రీ నిధి రుణాలు నలుగురు నుంచి ఐదుగురు సభ్యులకు మాత్రమే ఇచ్చేవారు. అది కూడా ఒక్కొక్కరికి రూ.25వేలు చొప్పున మొత్తం లక్ష రూపాయలు మంజూరు చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒక్కో మహిళ లక్ష రూపాయల వరకూ తీసుకునే సౌలభ్యం కల్పించారు. గ్రూపులో ఏడుగురు సభ్యులకు మొత్తం రూ.7లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నారు. అంతేగాక లబ్ధిదారులు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా పరిపుష్టి సాధించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పైసా ఖర్చు, తిరిగే పనిలేకుండా..

మహిళల జీవనోపాధి పెరిగేలా ప్రస్తుతం అతి తక్కువ శాతం వడ్డీపై స్త్రీ నిధి రుణాలను సకాలంలో మంజూరు చేస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా బ్యాంకుల చుట్టూ తిరిగే పనిలేకుండా ఇంటి నుంచే రుణాలు పొందే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోగా రుణాలు మంజూరు చేస్తున్నారు. ఇందుకోసం ఎవరికీ పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. జీఎస్టీ, ప్రాసెసింగ్ ఫీజు కూడా లేదు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ. 72 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటికే రూ. 3.2 కోట్లను లబ్ధిదారులకు అందజేశారు. రుణం తీసుకున్న మహిళ మరణిస్తే భారం ఇతర సభ్యులపై పడకుండా ఆమె చెల్లించాల్సిన మొత్తాన్ని మాఫీ చేస్తున్నారు. స్వయం సహాయక గ్రూపు మహిళలకు తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నారు. రుణాలు తీసుకుని చెల్లించే వడ్డీతో స్త్రీ నిధి సంస్థకు లాభాలు వస్తున్నాయి. వచ్చిన లాభాల్లో కొంత భాగాన్ని గ్రామ సంఘాలు (వీఓఏ), మండల సమాఖ్యలకు కేటాయిస్తున్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి


ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు


అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణమూర్తి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అర్చన నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

సెంచూరియన్‌తో మొరాకో ప్రభుత్వం ఒప్పందం

- పర్లాకిమిడి క్యాంపస్‌లో నలుగురు అధికారుల బృందం పర్యటన


ద్వైపాక్షిక ఒప్పంద సమావేశంలో మాట్లాడుతున్న వీసీ సుప్రియా పట్నాయక్


మీడియాతో మాట్లాడుతున్న మొరాకో ఉన్నతాధికారి మహ్మద్ తహ్రీ

పర్లాకిమిడి: వాయువ్య ఆఫ్రికా ఖండంలోని మొరాకో దేశం వివిధ రంగాల్లో కలిసి పనిచేసేందుకు స్థానిక సెంచూరియన్ వర్సిటీతో ఒప్పందం కుదుర్చుకుంది. వ్యవసాయం, చేపల పెంపకం, నైపుణ్యాభివృద్ధి, మినీ డెయిరీ, బ్యాకరీ, డ్రాగన్ ఫ్రూట్, ఉన్నత విద్య టెక్నాలజీ, 3డీ ల్యాబ్ నిర్మాణానికి ఆఫ్రికా–ఇండో ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఈ నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు నలుగురు సభ్యుల మొరాకో ప్రభుత్వ అధికార బృందం పర్లాకిమిడి సెంచూరియన్ క్యాంపస్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ బోర్డు హాలులో జరిగిన విలేకర్ల సమావేశంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ సుప్రియా పట్నాయక్ మాట్లాడారు. నీతి ఆయోగ్, ఇండో–ఆఫ్రికా ద్వైపాక్షిక సంబంధాల మేరకు మొరాకో ఉన్నత విద్యాభివృద్ధి అధికారి మహ్మద్ తహ్రీ, అమెరికా–ఆసియా మైత్రి భాగస్వామ్యుల ఇన్‌చార్జి అబ్దుల్లా ఫెజర్, సలహాదారు మొరాకో ఉన్నత విద్యాశాఖ అమల్ లరిబీ వర్సిటీని సందర్శించారని తెలిపారు. అక్కడి దేశంలో పారిశ్రామిక నైపుణ్యం, అనుసంధాన విద్య, వ్యవసాయంలో సాంకేతికత, యాంత్రీకరణ, వస్తు తయారీ, ఏరోస్పేస్, ఆహార శుద్ధి, ఐటీ తదితర రంగాలలో ఇరుదేశాలు సహకారం అందిపుచ్చుకునేందుకు ఆసక్తి చూపించారని వెల్లడించారు. మొరాకో అధికారి మహ్మద్ తహ్రీ మాట్లాడుతూ.. సెంచూరియన్‌లతో కలిసి పనిచేందుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రో, అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రభుత్వ సంబంధాల అసోసియేట్ డైరెక్టర్ మోనా లిసా ఘోష్, వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ ఎస్పీ నందా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాల సంతోషం

- డిప్యూటీ సీఎం రాజన్నదొర


వైఎస్సార్ విగ్రహం దగ్గర రాజన్నదొర, తదితరులు

మెంటాడ: జగనన్న పాలనలో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని డిప్యూటీ సీఎం, గిరిజనశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పిట్టాడ గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పథకాల లబ్ధితో కూడిన బుక్‌లెట్‌లను వారికి అందజేశారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ అమలు చేయని సంక్షేమ పథకాలను పేదవాడి చెంతకు చేర్చి ప్రతి అడుగులో అడుగైనడిచిన జగనన్నకు ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కులం,మతం,ప్రాంతీయ భేదం లేకుండా సంక్షేమ ఫలాలను అందించిన జగనన్న పాలనలో ప్రతి ఇంటికి అందుతున్న లబ్ధిని వివరిస్తుంటే లబ్ధిదారులు బావోద్వేగానికి గురై వారి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారన్నారు. పేద,బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటున్న జగనన్నను మళ్లీ సీఎం చేసే బాధ్యత మనందరిపైనా ఉందని స్పష్టం చేశారు

వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగేళ్లలో శత శాతం హామీలను అమలుచేసి ప్రజల గుండెల్లో తమ పెద్దకుమారుడిగా నిలిచిపోయిన జగన్ మోహన్ రెడ్డి పాలన శభాష్ అని దేశమంతా కోడైకూస్తోందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పిట్టాడలోని వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. సర్పంచ్ కాపారపు నాయుడుబాబు, కొప్పలవెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర డైరెక్టర్ రెడ్డి గౌరి,ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు లెంకరత్నాకర్‌నాయుడు, రెడ్డి రాజప్పలనాయుడు, చొక్కాకుల సన్యాసినాయుడు, కనిమెరక త్రినాథ్, ఎంపీడీఓ తివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబుతో పాటు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎస్‌ఆర్ నిధులతో మౌలిక వసతుల కల్పన

- కలెక్టర్ నాగలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని పారిశ్రామిక సంస్థలు తమ లాభాల నుంచి కార్పొరేట్ సామజిక బాధ్యత కింద ఖర్చు చేసే నిధులతో జిల్లాలో సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. పరిశ్రమలకు ఖర్చు చేసే సీఎస్ఆర్ నిధులను ఈ కార్యక్రమాలకే వినియోగించేలా ఆయా యాజమాన్యాలతో సంప్రదించాలని సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం ఆమె పరిశ్రమలశాఖకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా ఆస్పత్రుల్లో ఆపరేషన్ థియేటర్లు, హాస్టళ్ల పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఇతర వసతులు కల్పించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పరిశ్రమలు తమకు వచ్చే లాభం నుంచి 2 శాతం నిధులను సీఎస్ఆర్ కింద వినియోగించాల్సి ఉంటుందన్నారు. ఆ నిధులను సమీకరించే లక్ష్యంతో జిల్లా స్థాయిలో ఒక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, సీపీఓ బాలాజీ, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సుదర్శనం, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ఆదర్శ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరంలో ఆదర్శ కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. మక్కువ మండలంలోని మునక్కాయవలస, సాలూరు మండలం పురోహితునివలస, భామిని, కురుపాం కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశించిన వారికి ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో ఉచిత విద్యను అందించనున్నామని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్://ఏపీఎంఎస్.ఏపీసిఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో జూన్ 7లోగా పంపించాలని వివరించారు.

26 నుంచి ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

తెర్లాం: మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలో ఈ నెల 26నుంచి ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ దివంగత బొత్స కిశోర్ జ్ఞాపకార్థం మూడు రోజులపాటు వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఆసక్తి గల వాలీబాల్ జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన వచ్చని ఆహ్వానించారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన మొదటి నాలుగు జట్లకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వాలీబాల్ టోర్నమెంట్‌పై మరిన్ని వివరాలకు ఫోన్ 9398354173, 8919549679, 9010366148 నంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

తమ్ముడే కాలయముడు

- కత్తితో అన్నను పొడిచి హత్య


తమ్ముడు చేతిలో హత్యకు గురైన అన్నయ్య పాలక ఇండియా


దర్యాప్తు చేస్తున్న ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, సిబ్బంది

కురుపాం: తోడబుట్టిన తమ్ముడే అన్నయ్యను కత్తితో హతమార్చాడు. ఈ సంఘటన వివరాల్లోకి వెళితే కురుపాం మండలంలోని జి శివడ పంచాయతీ వేపమానుగూడ గిరిజన గ్రామంలో సోమవారం రాత్రి పాలక ఇండియా (30) గొంతుపై తమ్ముడు పాలక మిన్నారావు కత్తితో పొడిచి హత్యచేశాడు. ఈ నెల 20 వతేదిన పాలక ఇండియా తమ్ముడు పాలక మిన్నారావుకు వివాహం జరగగా పెళ్లికి సంబంధించి ఖర్చులు, సారె నిమిత్తం ఇద్దరు అన్నదమ్ముల మధ్య గొడవ జరిగింది. తీవ్ర కోపంతో అన్నయ్య ఇండియాపై ఉన్న మిన్నారావు సోమవారం సాయంత్రం కత్తితో పొడిచి హత్యకు పాల్పడి పరారయ్యాడు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, నీలకంఠాపురం ఇన్‌చార్జ్ ఎస్సై షణ్ముఖరావులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పూరిల్లు దగ్ధం


దగ్ధమైన పూరిల్లు


విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారణంగా కాలిపోతున్న ఇల్లు

వంగర: మండల పరిధి గీతనాపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో గ్రామానికి చెందిన రేగిడి లక్ష్మణదొర ఇల్లు అగ్నికి ఆహుతైంది. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మణదొరను ఆదుకోవాలని సర్పంచ్ నెయిగాపుల శివరామకృష్ణయ్య అధికారులను కోరారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మరో ఇల్లు..

కురుపాం: మండల కేంద్రంలోని మంతినవలస కాలనీలో మంగళవారం మధ్యాహ్నం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా బచ్చల మోహన్‌రావుకు చెందిన ఇంట్లో సామగ్రి కాలిబూడిదైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో మంటల వ్యాప్తిని గుర్తించిన స్థానికులు గుమ్మలక్ష్మీపురం అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో వెంటనే చేరుకున్న వాహనం మంటలను నివారించి ఇతర ఇళ్లకు చేరకుండా అడ్డుకుంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రమేష్‌కుమార్, ఆర్ఐ ప్రసాద్, వీఆర్ఓ మెరకయ్యలు సంఘటనా స్థలానికి వచ్చి ఏ మేరకు ఆస్తినష్టం జరిగిందో గుర్తించారు. ఈ ప్రమాదంలో బంగారం, నగదు, ఫ్రిజ్, బట్టలు, ఇన్వర్టర్ కాలి బూడిదైనట్లు గుర్తించారు.

చిన్నారికి ఆర్థిక సాయం

- రూ.లక్ష చెక్కును అందజేసిన జేసీ మయూర్ అశోక్


చిన్నారి హేమలత తల్లి లావణ్యకు చెక్కు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విజయనగరం ఫోర్ట్/రేగిడి: ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి స్పందన మేరకు రేగిడి ఆముదాలవలస మండలం కందిశ గ్రామానికి చెందిన చిన్నారి పొనగంటి హేమలత చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదలైన ఆర్థిక సాయాన్ని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మంగళవారం అందజేశారు. ఇటీవల భోగాపురం విచ్చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని చిన్నారి హేమలత తల్లిదండ్రులు కన్నబాబు, లక్ష్మి లావణ్యలు కలిసి పాప సమస్యను విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి సంబంధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు రూ. లక్ష చెక్కును జాయింట్ కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గణపతిరావు, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, సామాజిక కార్యకర్త సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

10కిలోల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట: నియోజకవర్గ ప్రధాన కేంద్రం ఎస్.కోటలో పోలీసులకు మంగళవారం 10కిలోల గంజాయి పట్టుబడింది. ఎస్సై తారకేశ్వరరావు చెప్పిన వివరాల మేరకు స్థానిక రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద బైక్‌పై వస్తున్న వ్యక్తిని ఆపి సోదా చేయగా 10కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయితో పట్టుబడిన నిందితుడిని డుంబ్రిగూడ మండలానికి చెందిన వంతల ఆనందరావుగా గుర్తించి అదుపులోకి తీసుకుని డిప్యూటీ తహసీల్దార్ వీఆర్వో సమక్షంలో కేసు నమోదు చేశారు. బుధవారం నిందితుడిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై చెప్పారు.

తప్పిపోయిన బాలుడు


అదృశ్యమైన సీమోను

విజయనగరం క్రైమ్: ఆడుకుందామని బయటకు వెళ్లిన పదేళ్ల బాలుడు కనిపించకుండా పోయినట్లు తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదుచేశారు. గాజులరేగకు చెందిన పదేళ్ల సీమోను ఆరెంజ్ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడని, సోమవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు ఫోన్ 7396177755, 8465055876 నంబర్లను గానీ వన్‌టౌన్ పోలీసులకు గానీ సంప్రదించాలని వన్‌టౌన్ పోలీసులు కోరారు.